



రాంబిల్లి మండలం పంచదార్లలో ఉమాధర్మ లింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



ఓం.. శివోహం!



నర్సీపట్నంలోని బలిఘట్టం ఆలయంలో పూజలందుకుంటున్న బ్రహ్మలింగేశ్వరస్వామి

హరహర మహాదేవ శంభోశంకర

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- భక్తజన సంద్రంగా మారిన ఆలయాల పరిసరాలు



కల్యాణపులోవ జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు. (ఇన్‌సెట్‌లో) ఆలయంలో పూజలందుకుంటున్న పోతురాజుబాబు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని అన్ని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయాలు, పరిసరాలు హోరెత్తాయి. అర్చకులు ఆలయాల్లో తెల్లవారుజామునే అర్చనలు, అభిషేకాలు నిర్వహించి సాధారణ భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. చిన్న పిల్లలు మొదలు వృద్ధుల వరకు ఆలయాలకు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపారాధన చేశారు. జిల్లాలో రావికమతం మండలం కల్యాణపులోవకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరించి, సమీపంలో వున్న ఆలయంలో పోతురాజుబాబు, పెద్దింటమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు తొలిరోజు వేలాది మంది భక్తులు తరలిరావడంతో రావికమతం- నర్సీపట్నం రోడ్డులో దొండపూడి రాణా నుంచి కల్యాణపులోవ వరకు రద్దీ నెలకొంది. జిల్లాలో అతిపురాతనమైన శైవక్షేత్రాల్లో ఒకటైన రాంబిల్లి మండలం పంచదార్లలోని ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయం భక్తులరాకతో రద్దీగా మారింది. తొలుత రాధామాధవస్వామి ఆలయ ప్రాంగణంలో ఆకాశ గంగ వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఫణిగిరిపై వెలసిన ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. నర్సీపట్నంలోని బలిఘట్టం త్రిముఖ పర్వతశ్రేణిపై వెలసిన రాజరాజేశ్వరి సహిత బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొలుత ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం స్వామిని దర్శించుకున్నారు.

చోడవరం పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గొలుగొండ మండలం పాతమల్లంపేటలోని ఉమాధారమల్లీశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

ఈ-క్రాప్ నమోదుకు గడువు పెంపు

- 3వ తేదీ వరకు అవకాశం

అనకాపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలను సాగు చేస్తున్న రైతులు ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు గడువును వచ్చే నెల మూడో తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. వాస్తవానికి ఈ రెండింటి నమోదు ఈ నెల 25వ తేదీతో ముగిసింది. వివరాల నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురవడంతో పలువురు రైతులు నమోదు చేయించుకోలేకపోయారు. రబీలో వరి, మినుము, పెసర పంటలకు ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించింది. అందువల్ల ఆయా పంటలను సాగుచేస్తున్న రైతులందరూ ఈ-కాప్, ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలి. జిల్లాలో 27,163 మంది రైతులు 31,655 ఎకరాల్లో వరి, పెసర, మినుము పంటల సాగు చేపట్టారు. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 25వ తేదీనాటికి 22,742 మంది రైతులు 26,606 ఎకరాలకు సంబంధించి ఈ-కాప్ నమోదు చేయించుకున్నారు. ఇంకా 4,421 మంది రైతులు 5,049 ఎకరాలకు సంబంధించి నమోదు చేయించుకోలేదు. దీంతో ఆయా రైతులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. ఈ-కాప్, ఈ-కేవైసీ నమోదు గడువును నెల మూడో తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మరో ఐదు రోజుల సమయం వుండడంతో శత శాతం నమోదుకు కృషి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. 95 శాతం ఈ-క్రాప్ నమోదుతో చోడవరం మండలంలో ముందంజలో వుండగా, రాంబిల్లి మండలం చివరిస్థానంలో వుంది. ఈ మండలంలో 674 మంది రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోలేదని అధికారులు చెబుతున్నారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్

- ఆరు జిల్లాల్లో 22,493 మంది ఓటర్లు
- పురుషులు 13,508, మహిళలు 8,985
- పోలింగ్ కేంద్రాలు 123
- పోలింగ్ సిబ్బంది 739 మంది
- 3న ఓట్ల లెక్కింపు



పాకలపాటి రఘువర్మ



శ్రీనివాసులునాయుడు



కోరెడ్ల విజయగౌరి

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం పోలింగ్ జరగనున్నది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగియనున్నది. అందుకు తగిన ఏర్పాట్లు అధికారులు పూర్తిచేశారు. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వ్యవహరిస్తుండగా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఉన్నారు.

ఆరు జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 13,508 మంది, మహిళలు 8,985 మంది ఉన్నారు. పోలింగ్ కోసం ఆరు జిల్లాల పరిధిలో 123 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు 739 మంది అధికారులను నియమించారు. వీరిలో 148 మంది పీవోలు, 148 మంది ఏపీవోలు, 295 మంది ఓపీవోలు ఉన్నారు. మరో 148 మంది మైక్రో అబ్జర్వర్లను ... మిగతా 6వ పేజీలో

ఓటర్ల వివరాలు...

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం	31	3,416	1,619	5,032
పార్వతీపురం మన్యం	15	1,574	759	2,332
విజయనగరం	29	3,270	1,953	5,223
అల్లూరి సీతారామరాజు	11	920	568	1,488
విశాఖపట్నం	13	2,539	2,990	5,529
అనకాపల్లి	24	1,789	1,096	2,885
మొత్తం	123	13,508	8,985	22,493

ముగ్గురి మధ్య ప్రధాన పోటీ

బరిలో పది మంది అభ్యర్థులు ఉండగా ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. సుంకరి శ్రీనివాసరావు పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం క్రితం ప్రకటించారు. ఆయన రఘువర్మకు మద్దతు పలికారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలతోపాటు టీడీపీ, జనసేన మద్దతు ప్రకటించాయి. మరో అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. అదేవిధంగా కూటమి భాగస్వామి అయిన బీజేపీకి చెందిన కొందరు నాయకులు సంఘీభావం ప్రకటించారు. కోరెడ్ల విజయగౌరికి వామపక్షాలకు అనుబంధంగా ఉండే ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. సాంకేతికంగా బ్యాలెట్‌లో 10 మంది పేర్లు ఉండగా...వారిలో ఒకరు తప్పుకున్నారు. మిగిలిన తొమ్మిది మందిలో ప్రధానంగా పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే పోటీ ఉంది.



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన సిబ్బంది

జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

24 పోలింగ్ కేంద్రాలు, 2,885 మంది ఓటర్లు

- ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ
- ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు చేరిక

అనకాపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా నేతృత్వంలో జిల్లాలో ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం నిర్వహించనున్న పోలింగ్‌కు సంబంధించి అనకాపల్లిలోని జీవీఎంసీ హైస్కూల్‌లో బుధవారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ సత్యనారాయణరావు పర్యవేక్షణలో పది కౌంటర్లను ఏర్పాటు ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో 2,885 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ప్రతి కేంద్రానికి పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి, ఇద్దరు సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాలకు బయట, లోపల రెండు వెబ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్ పర్యవేక్షిస్తారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేర్చి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తారు. కాగా అనకాపల్లిలోని 105వ నంబరు పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 582 ఓటర్లు వున్నారు. రాంబిల్లిలోని 110వ పోలింగ్ ... మిగతా 6వ పేజీలో

పండగ పూట విషాదం

వేర్వేరు సంఘటనల్లో నలుగురి మృతి

- ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద వరహా నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన విద్యార్థి
- ధర్మవరం అగ్రహారంలో తాటిచెట్టు పైనుంచి జారిపడి కూలీ మృతి
- నర్సీపట్నంలో చెట్టుకి ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య
- రాజుపాలెం వద్ద రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



పీపీ దుర్గాచరణ్ (ఫైల్ ఫొటో)



చిందాడ శ్రీను (ఫైల్ ఫొటో)



పనసల చంద్రశేఖర్ (ఫైల్ ఫొటో)

మహాశివరాత్రి పర్వదినాన పలు కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంది. జిల్లాలోని వివిధ ప్రదేశాల్లో బుధవారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో నలుగురు మృతిచెందారు. ఎస్.రాయవరం మండలం పెనుగొల్లుకు చెందిన విద్యార్థి వరహా నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఇదే గ్రామానికి చెందిన మరో యువకుడు తాటిచెట్టు పైనుంచి జారిపడి మృతిచెందాడు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం కంపరేగల గ్రామానికి చెందిన ఒక యువకుడు మద్యానికి బానిసై, నర్సీపట్నంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనకాపల్లి మండలం రాజుపాలెం సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు.

నదిలో మునిగి డిప్లొమా విద్యార్థి మృతి

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు గ్రామానికి చెందిన పక్కుర్తి వెంకట దుర్గ చరణ్ (20) కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్లొమా చదువుతున్నాడు. మహాశివరాత్రి సందర్భంగా కళాశాలకు సెలవు ఇవ్వడంతో సొంతూరు వచ్చాడు. బుధవారం ఉదయం తమ్ముడు సాత్విక్, మామయ్య కుమారుడు హేమశేఖర్ కలిసి గ్రామానికి సమీపంలోని వరహా నది వద్దకు వెళ్లారు. సరదాగా ఈత కొట్టడానికి నదిలో దిగారు. చరణ్ కొంత లోపలికి వెళ్లడంతో అక్కడ వున్న లోతైన గొయ్యిలో పడ్డాడు. ఇతనితోపాటు అక్కడ వున్న వారిలో ఎవరికీ ఈత రాకపోవడంతో కాపాడే వారు లేక నీటిలో మునిగిపోయాడు. దీంతో సాత్విక్, హేమశేఖర్ పెద్దగా కేకలు వేయడంతో కొద్ది దూరంలో వున్న యువకులు వచ్చి నీటిలో మునిగిపోయిన చరణ్‌ను బయటకు తీశారు. కొనఊపిరితో వుండడంతో హుటాహుటిన నక్కపల్లి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు.

తాటిచెట్టు పైనుంచి జారిపడి కూలీ మృతి

ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రామానికి చెందిన చిందాడ శ్రీను (31) తాటి చెట్లు ఎక్కి కమ్మలు నరుకుతూ ఉపాధి పొందుతుంటాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ధర్మవరం అగ్రహారం గ్రామంలో ఓ రైతుకు చెందిన పొలంలో తాటిచెట్ల కమ్మలు నరకడానికి తన సోదరుడు రమణ, మరికొంతమంది కూలీలతో కలిసి వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కి కమ్మలు నరుకుతుండగా శ్రీను ప్రమాదవశాత్తూ కింద పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో నక్కపల్లి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. విశాఖ తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ... మిగతా 6వ పేజీలో

నేడు పాఠశాలలకు సెలవు

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు గురు వారం సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను అన్ని పాఠశాలల యాజమాన్యాలు కచ్చితంగా పాటించాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు.

పరిమితికి మించి రాయి రవాణా

- టిప్పర్ లారీకి రూ.86 వేలు జరిమానా

కొత్తూరు (అనకాపల్లి), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి క్వారీ రాయి తరలిస్తున్న లారీకి రూ.86 వేలు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణ తెలిపారు. తుమ్మపాల వైపు నుంచి నల్లరాయి లోడుతో వస్తున్న టిప్పర్ లారీ అనకాపల్లి పట్టణంలోని విజయరామరాజు పేట సమీపంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి పైభాగానికి తగిలి ఆగిపోయింది. సమాచారం అందుకున్న సీఐ ఎం.వెంకట నారాయణ అక్కడకు వెళ్లి లారీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రూ.86 వేలు జరిమానా విధిస్తూ చలానా రాశారు. తదుపరి చర్యల నిమిత్తం లారీ రవాణా శాఖ అధికారులకు అప్పగించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్ లారీ

చస్తే ఇక్కడ చావే!

చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో అందుబాటులోకి రాని పోస్టుమార్టం కేంద్రాలు

- ప్రమాదాల మృతదేహాలను అనకాపల్లి, విశాఖ తరలించాల్సి దుస్థితి
- చోడవరంలో పీఎం భవన నిర్మాణం పూర్తి.. సరఫరాకాని పరికరాలు
- మాడుగుల, కె.కోటపాడుల్లో 90 శాతం పనులు పూర్తి
- త్వరగా అందుబాటులోకి తేవాలని ప్రజల వినతి



చోడవరం తామరచెరువు సమీపంలో నిర్మాణం పూర్తయిన పోస్టుమార్టం భవనం

చోడవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాలోని మూడు సామాజిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా పోస్టుమార్టం కేంద్రాలు (మార్చురీలు) అందుబాటులో లేకపోవడం మృతుల కుటుంబీకులకు ప్రాణసంకటంగా మారింది. సాధారణంగా కాకుండా రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, నీటిలో మునిగిపోవడం, ఇతరత్రా సంఘటనల్లో చనిపోయిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం చేయించడానికి, తిరిగి మృతదేహాలను ఇళ్లకు తీసుకెళ్లడానికి నానాపాట్లు పడాల్సి వస్తున్నది.

మాడుగుల నియోజకవర్గంలోని కె.కోటపాడులో 50 పడకల సీహెచ్‌సీ, మాడుగులలో 20 పడకల సీహెచ్‌సీ, నియోజకవర్గం కేంద్రమైన చోడవరంలో 20 పడకల సీహెచ్‌సీ వున్నాయి. రెండు నియోజకవర్గాల పరిధిలో దాదాపు మూడున్నర లక్షల మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే ఈ మూడు ఆస్పత్రులకు అనుబంధంగా మార్చురీలు (పోస్టుమార్టం కేంద్రాలు) లేవు. మార్చురీలను ఏర్పాటు చేయించడంలో అధికారులతోపాటు, ప్రజాప్రతినిధులు సైతం దృష్టిసారించకపోవడంతో, పోలీసు కేసులు నమోదయ్యే సంఘటనల్లో ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు కష్టాలు తప్పడం లేదు. చోడవరంలో ఐదేళ్ల క్రితం వరకు పోస్టుమార్టం కేంద్రం ఉండేది. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో ప్రమాదవశాత్తూ చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఇక్కడకు తీసుకువచ్చేవారు. అయితే మార్చురీ భవనం శిథిలావస్థకు చేరడంతో పోస్టుమార్టం చేయడానికి డాక్టర్లు విముఖత చూపేవారు. దీంతో ... మిగతా 6వ పేజీలో

'ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ విజయానికి సమష్టిగా పనిచేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ

ఎలమంచిలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపునకు అంతా సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికలను అంతా ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. రఘువర్మ విజయానికి అంతా ముందుండాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాజాన సూర్య నాగేశ్వరావు, మండల శాఖ అధ్యక్షుడు ఇత్తంశెట్టి రాజు, పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, నాయకులు మేరుగు బాపునాయుడు, పొనమళ్ల కొండ బాబు, కొఠారు సాంబ, గొన్నాబత్తుల శేషు, రాజాన వెంకునాయుడు, మజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఓటింగ్‌కు సర్వం సిద్ధం'

మునగపాక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరగనున్న నేపథ్యంలో ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పోలింగ్ ఆఫీసర్ ఎం.రామారావు తెలిపారు. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్ర ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 45 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు.

రాంబిల్లి : ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి రాంబిల్లి జడ్పీ హైస్కూల్‌లో ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ 26 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు.

నాగులాపల్లిలో నాయీబ్రాహ్మణ సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక

మునగపాక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నాగులాపల్లిలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ బుధవారం ఎన్నికైంది. పర్వతవర్థిని రామలింగేశ్వర ఆలయంలో జరిగిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా కొడమంచిలి దక్షిణేశ్వరరావు, కార్యదర్శిగా కె.అప్పారావు, ఉపాధ్యక్షుడిగా ద్రాక్షారపు సూరి అప్పారావు, కోశాధికారిగా సిరిపల్లి రమణ, సలహాదారుడుగా కె.శంకరరావులతో పాటు మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



ఎలమంచిలి : కొత్తపేట రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల కోలాహలం



మునగపాక : వాడ్రాపల్లి దక్షిణేశ్వరుడ్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్

భక్తిశ్రద్ధలతో శివరాత్రి ఉత్సవాలు

▸ వేకువజాము నుంచి ఆలయాలు కిటకిట ▸ స్వామికి విశేష పూజలు నిర్వహించిన అర్చకులు ▸ రాంబిల్లి మండలం పంచదార్లలో మరింత కోలాహలం

రాంబిల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని నియోజకవర్గంలోని రాంబిల్లి, ఎలమంచిలి, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధానంగా రాంబిల్లి మండలంలోని ప్రాచీన ప్రముఖ శైవక్షేత్రమైన పంచదార్ల పుణ్యక్షేత్రం భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. జిల్లా నలుమూలలు నుంచి వేలాది మంది వేకువజాము నుంచే తరలిరావడం ఆరంభించారు. రోజంతా ఈ కోలాహల వాతావరణం సాగింది. ముందుగా ఇక్కడి రాధామాధవస్వామి ఆలయ గర్భంలో ప్రవహిస్తున్న ఆకాశ గంగగా పిలిచే ప్రధాన ధార వద్ద భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. అనంతరం ఫణిగిరిపై వెలసిన ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎండోమెంట్ అధికారి సాంబశివరావు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాంబిల్లి సీఐ నర్సింగరావు ఆధ్వర్యంలో ఎస్ఐ నాగేంద్ర పోలీస్ బందోబస్తు నిర్వహించారు. అలాగే, గోకివాడలోని కొండల్లో వెలసిన శివలింగాన్ని, దిమిలి, వెలుచూరు, కొత్తపేట, లాలంకోడూరు, కట్టుబోలు, కొత్తపట్నం గ్రామాల్లోని ఆలయాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇదిలావుంటే, కొత్తపట్నం సముద్రతీరం వద్ద ఉన్న ఆలయంలో గౌరీపరమేశ్వరులు, అభయాంజనేయస్వామి తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల్లోని మత్స్యకారులంతా తరలి రావడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఎలమంచిలి మండలంలో...

ఎలమంచిలి : మునిసిపాలిటీతో పాటు మండలంలోని గ్రామ గ్రామాలన మహాశివరాత్రి పర్వదినాన్ని అత్యంత ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచి స్వామివారి దర్శనానికి బారులుతీరారు. ఎలమంచిలోని పురాతన రామలింగేశ్వర ఆలయంతో పాటు త్రిమూర్తులుస్వామి, బైపాస్ రోడ్డులోని సోమస్కందస్వామి, పాతవీధిలో శివలింగం వద్ద భక్తుల కోలాహలం అధికంగా ఉంది. సోమలింగపాలెం, పెదపల్లి, కొక్కిరాపల్లి, కట్టుపాలెం, కొత్తపాలెం, యర్రవరం, టిడ్కో సముదాయాల్లోని ఆలయాలు భక్తులతో పాటు ఏటికొప్పాక, పులపర్తి, పీఎన్ఆర్‌పేట, రేగుపాలెం గ్రామాల్లోని ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.



రాంబిల్లి మండలం పంచదార్లలో భక్తుల పుణ్యస్నానాలు



అచ్యుతాపురం ఆలయంలో ప్రగడ పూజలు

మునగపాక మండలంలో...

మునగపాక : మండలంలో శివరాత్రి పర్వదినాన్ని అంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శతాబ్దాల చరిత్ర కలిగిన వాడ్రాపల్లి దక్షిణేశ్వరస్వామి, నాగులాపల్లి పర్వతవర్ధినీ రామలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు మునగపాక మెయిన్‌రోడ్డులో గల విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, పల్లపువీధిలోని సాంబమూర్తి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే, టి.సిరసపల్లిలోని వీరభద్రస్వామి, వెంకటాపురంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయాలతో పాటు మిగిలిన గ్రామాల్లోని ఆలయాల్లో పరమశివునికి విశేష పూజలు నిర్వహించారు. ఇదిలావుంటే, వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వరస్వామిని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

అచ్యుతాపురం మండలంలో...

అచ్యుతాపురం : మహాశివరాత్రిని మండలవాసులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనానికి ఆలయాల వద్ద బారులు తీరారు. అర్చకులు పంచామృతాభిషేకాలతో పాటు భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో రాత్రికి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అచ్యుతాపురంతో పాటు పలు ఆలయాల్లో టీడీపీ నాయకుడు ప్రగడ నాగేశ్వరరావు పూజలు నిర్వహించారు.



రామాలయం వద్ద తులసికోట ప్రతిష్ఠ

ఎలమంచిలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాతవీధి రామాలయం వద్ద బుధవారం విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ సతీమణి మాలతి చేతుల మీదుగా తులసి కోటను ప్రతిష్ఠించారు. ఈ సంద ర్భంగా యల్లపు అయోధ్య నాగరాజు, స్థానిక పెద్దల సమక్షంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పరమేశ్వరుని ప్రభను పల్లకీలో ఊరేగించారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

నియమించారు. ఎన్నికల సిబ్బంది, మెటీరియల్‌ను బుధవారం సాయంత్రానికే కేంద్రాలకు తరలించారు. ఎన్నిక బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్నారు. పోలింగ్ నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు...

సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోరెడ్ల విజయగౌరి, గాదె శ్రీనివాసులనాయుడు, కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, సత్తలూరి పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, పోతల దుర్గాప్రసాద్, సుంకర శ్రీనివాసరావు (ఈయన పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం క్రితం ప్రకటించారు)

ఓటు హక్కు ఎవరికి ఉంటుందంటే...

ఉన్నత పాఠశాలల్లో బోధన చేసే స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎంలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు, జూనియర్/డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, యూనివర్సిటీ కళాశాలల అధ్యాపకులు, ప్రైవేటు పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్ కేడర్‌లో ఉన్న టీచర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఓటరు ప్రాధాన్యతా క్రమంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఒక అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేస్తున్నట్టు అయితే పేరుకు ఎదురుగా ఉన్న గడిలో 'ఒకటి' అని నంబరు వేయాలి. అంతే తప్ప టిక్‌లు పెట్టరాదు. ఓటరుకు బ్యాలెట్ పేపరుతోపాటు స్కెచ్ పెన్ను ఇస్తారు. ఆ పెన్ మాత్రమే ఉపయోగించి ఓటువేయాలి తప్ప ఇతర పెన్నులు వాడరాదు.

మూడో తేదీన ఓట్ల లెక్కింపు

ఎన్నికలలో కీలకమైన పోలింగ్ గురువారం సాయంత్రం నాలుగు గంటలతో ముగియనున్నది. నగరంలోని పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను సాయంత్రం ఆరు గంటల తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం బ్లాక్‌లో భద్రపరుస్తారు. మిగిలిన జిల్లాల నుంచి గురువారం రాత్రికి బ్యాలెట్‌బాక్సులు వస్తాయి. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. దీనికి సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి రెండు రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

... 5వ పేజీ తరువాయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్... హాజరైన సిబ్బంది

కేంద్రంలో అత్యల్పంగా 26 మంది ఓటర్లు వున్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి: కలెక్టర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. స్థానిక జీవీఎంసీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఉదయం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ ప్రారంభం నుంచి బ్యాలట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకు ఎన్నికల కమిషన్ నిబంధనలకు తు.చ. తప్పకుండా పాటించాలని అన్నారు. ఎన్నికల సామగ్రిని పూర్తిగా పరిశీలించి, అన్నీ సక్రమంగా వున్న తరువాతే పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలని సూచించారు. అనంతరం ఎన్నికల సిబ్బంది ఆయా కౌంటర్ల వద్దకు వెళ్లి పోలింగ్ సామగ్రి తీసుకున్నారు. మధ్యాహ్న భోజనం తరువాత ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు షేక్ ఆయీషా, వీవీ రమణ, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, డీఎస్పీ ఎం.శ్రావణి, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ నాయుడు, తహసీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పండగ పూట విషాదం

... 5వ పేజీ తరువాయి

విభీషణరావు తెలిపారు. కాగా మహాశివరాత్రి పర్వదినాన గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందడంతో పెనుగొల్లులో విషాదఛాయలు అలముకున్నాయి.

చెట్టుకి ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నర్సీపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం నడింపాలెం పంచాయతీ కంపరేగల గ్రామానికి చెందిన పనసల చంద్రశేఖర్(22) ఇంటర్ పూర్తిచేశాడు. నర్సీపట్నంలోని ఒక ప్రైవేటు వస్త్ర దుకాణంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతని అన్న గోవింద్ డౌనూరు గ్రామ సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరూ నర్సీపట్నంలో నివాసం ఉంటున్నారు. అడవిరాజులుబాబు పండగ సందర్భంగా మంగళవారం కంపరేగల వెళ్లారు. అయితే చంద్రశేఖర్ కొంతకాలం నుంచి మద్యానికి బానిస అయ్యాడు. ఈ దుర్వ్యసనాన్ని మానేసి బుద్ధిగా పని చేసుకోమని అన్న గోవింద్ మందలించాడు. ఇద్దరూ కలిసి మంగళవారం సాయంత్రం తిరిగి నర్సీపట్నం వచ్చారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో కంపరేగల వెళ్లిపోతానని చంద్రశేఖర్ చెప్పడంతో గోవింద్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వదిలిపెట్టి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రోజూ మాదిరిగానే వాకింగ్ వచ్చిన వారు.. టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వెనుక ఉన్న చెట్టుకు ఓ యువకుడు ఉరివేసుకుని వేలాడుతుండడాన్ని చూసి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బందితో స్టేడియం వద్దకు వెళ్లి పరిశీలించారు. చెట్టు పక్కన ఉన్న సిమెంటు బెంచీ మీద బ్యాగ్, చిన్న కత్తి, ఒక అద్దం, ఊడిపోయిన కళ్ల జోడు కనిపించాయి. బ్యాగ్‌లో ఉన్న పర్సులో ఆధార్ కార్డు, పేపర్లు మీద రాసి వున్న ఫోన్ నంబర్లు చూశారు. ఆధార్ కార్డులో ఉన్న చిరునామా ఆధారంగా ఆత్మహత్య చేసుకున్న యువకుడు కొయ్యూరు మండలం కంపరేగల గ్రామానికి చెందిన పనసల చంద్రశేఖర్‌గా గుర్తించారు. అనంతరం అతని సోదరుడు గోవింద్‌కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. సీఐ గోవిందరావు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం రాజుపాలెం వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. రాజుపాలెం రైల్వే గేటు సమీపాన విశాఖ నుంచి విజయవాడ వైపు రైళ్లు వెళ్లే ట్రాక్ పక్కన గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్టు అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడు 5.3 అడుగుల ఎత్తు, 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉంటాడని ఆమె తెలిపారు. పసుపురంగు హాఫ్ హ్యాండ్ టీషర్టు, నేవీబ్లూ ఫుల్‌ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. అతని వివరాలు తెలిసిన వారు 73820 58996 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా మహా శివరాత్రి వేడుకలు



కిటకిటలాడుతున్న పేట బృందావనం శివాలయం

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గంలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. శివాలయాలకు భక్తులతో పోటెత్తారు. పాయకరావుపేట పట్టణంలోని లింగాలతోట కాలనీలోని ఉమాకోటిలింగేశ్వర స్వామి, రాజుగారిబీడు, బృందావనంలోని శివాలయాలతో పాటు తాండవ నది ఒడ్డున శివాలయానికి భక్తులు తరలివచ్చి అర్చనలు, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. పాండురంగస్వామి ఆలయం, మంగవరంరోడ్డులోని సీతారామాలయం, బృందావనం దుర్గాలమ్మచెట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలాగే మండలంలో పెంటకోట, గోపాలపట్నం సీత

భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు

మ్మవారికొండ, పెద్దిపాలెం, సత్యవరం, రాజగోపాలపురం, నామవరం, గోపాలపట్నం గ్రామాల్లోని శివాలయాలను భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గోపాలపట్నం సీతమ్మవారి కొండపై ఉమాధర్మలింగేశ్వరస్వామిని నక్కపల్లి, తుని, పాయకరావుపేట మండలాల భక్తులు దర్శించుకున్నారు. అలాగే పాల్మన్‌పేట, కొర్లయ్యపేట గ్రామాల్లో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. ఈవోపీఆర్‌డీ చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శులు తీరంలో పర్యవేక్షించారు.



కోటవురట్ల: పాములవాక పట్టాలమ్మ గుడిలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

నక్కపల్లిలో...

నక్కపల్లి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పురాతనమైన ఉపమాక శివాలయంలో తెల్లవారుజామున అర్చకులు మహేశ్, సంతోశ్ స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి సప్తహారతులిచ్చారు. గొడిచెర్ల శేష లింగేశ్వరస్వామి ఆలయం భక్తజన సందోహంతో నిండిపోయింది. అమలాపురం శివారు పాటి మీద శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రేబాకలో శ్రీశైల జ్యోతిర్లింగం, సోమనాథ జ్యోతిర్లింగ రూపాలను మాజీ సర్పంచ్ గొట్టుముక్కల శ్రీహరిరాజు నేతృత్వంలో భక్తులు నేరుగా పంచామృతాభిషేకాలు చేసుకున్నారు.



నక్కపల్లి: కిక్కిరిసిన ఉపమాక శివాలయం



ఎస్.రాయవరంలో స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని పెదగుమ్ములూరు, ఎస్. రాయవరం, గెడ్డపాలెం, పెదగుమ్ములూరు, సర్వసిద్ధి, పెనుగొల్లు, దార్లపూడి తదితర గ్రామాల్లో ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. కొన్ని గ్రామాల్లో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కోటవురట్లలో...

కోటవురట్ల: మండలంలో పలు గ్రామాల్లో శైవక్షేత్రాలు శివనామసర్మరణతో మార్మోగాయి. పాములవాక పట్టాలమ్మగుడి, లింగాపురం అయ్యప్ప దుర్గామల్లేశ్వర స్వామి, కోటవురట్ల సంతబయలు, జల్లూరు వంతెన వద్ద శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎండపల్లి, పందూరు శివాలయాల్లో భక్తులు పార్వతీపరమేశ్వరులకు అభిషేకాలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కోటవురట: మండంలోని గొట్టివాడ వరహనదిలో అనుమతులు లేకుండా ఇసుక రవాణాచేస్తున్న ట్రాక్టర్లను తహసీల్దార్ తిరుములబాబు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే జరిమానా విధిస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ హెచ్చరించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేయాలి

ఐటీ, విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు హోం మంత్రి అనిత వినతి



పాయకరావుపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఉండవల్లిలోని మంత్రి లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్, బల్క్ డ్రగ్ పార్కు, నక్కపల్లి కేంద్రంగా పారిశ్రామికాభివృద్ధికి అవకాశం ఉన్న నేపథ్యంలో నియోజకవర్గంలోని యువతకు అవసరమైన శిక్షణతో పాటు ఉపాధి కల్పన లక్ష్యంగా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని కోరినట్టు ఆమె స్థానిక విలేకరులకు తెలిపారు. అలాగే ఎస్.రాయవరం మండలంలో బాలికల కోసం ప్రత్యేకంగా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరినట్టు ఆమె చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

పాయకరావుపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పాయకరావుపేటలో సర్వం సిద్ధం చేశారు. మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న సచివాలయం-5లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం-102లో గురువారం పోలింగ్ జరగనుంది. మండలంలో మొత్తం 170 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 111, స్త్రీలు 57 ఉన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రంలో పీఓ, ఇద్దరు ఏపీఓలు, ఇద్దరు ఓపీఓలు, వీడియోగ్రాఫర్‌తోపాటు నలుగురు పోలీసులు విధులు నిర్వర్తిస్తారన్నారు. పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

కోటవురట్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ తిరుమల బాబు తెలిపారు. బుధవారం ఈ కేంద్రంలో వసతులను పరిశీలించారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఓటర్లకు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. మండలంలో మొత్తంగా ఓటర్లు 81 మంది కాగా, వీరిలో మహిళలు 56 మంది, 25 మంది పురుషులు ఉన్నట్టు తెలిపారు. వీరికి పోలింగ్ స్టేషన్ 98 కేటాయించినట్టు చెప్పారు. పోలింగ్ సిబ్బంది ఐదుగురిని నియమించామన్నారు.

నక్కపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికకు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం పరిధిలో మొత్తం 52 మంది ఓటర్లు ఓటు హక్కువినియోగించుకోనున్నట్టు తహసీల్దార్ నరసింహమూర్తి చెప్పారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ కన్నబాబు ఉన్నారు.

నేడు రాజయ్యపేటలో నూకతాత సంబరం

నక్కపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేటలో మత్స్యకారుల ఆరాధ్యదైవమైన నూకతాత పండుగ గురువారం జరగనుంది. ఇందులో భాగంగా గ్రామంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. గ్రామ పురవీధుల్లోనూ భారీ స్థాయిలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. నూకతాత ఆలయాన్ని ముస్తాబు చేశారు. గురువారం ఉదయం ఆలయంలో మత్స్యకారులు నూకతాతను దర్శించుకుంటారు. గ్రామ సమీప తీరంలో నూకతాత ఘటాలు, రామలక్ష్మణ విగ్రహాలకు స్నానాలు చేయిస్తారు. అనంతరం ఘటాలను పట్టుకున్న పూజారులు తీరం నుంచి గ్రామ ప్రధాన రహదారి వరకూ వచ్చి, అక్కడ రోడ్డుపై శయనించిన భక్తులపై నుంచి దాటుకుని వెళ్తారు. దీన్నే మత్స్యకారులు సపం అంటారు. ఇలా చేస్తే నూకతాత ఆశీస్సులు తమకు వుంటాయని భక్తుల విశ్వాసం. ఏడాది పొడవునా సముద్రంలో చేపలవేటకు వెళ్లినా, ఏ వృత్తి చేసినా ఎటువంటి ఆటంకం రాదని మత్స్యకారులు నమ్ముతారు. ఈ సందర్భంగా గురు, శుక్రవారాల్లో గ్రామంలో జాతర జరుగుతుంది. శుక్రవారం రాజయ్యపేట, సమీపాన వున్న బోయపాడు తీరాల్లో భక్తులు శివరాత్రి అమావాస్య పుణ్య స్నానాలు ఆచరిస్తారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంతాలను సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు పరిశీలించారు.

చస్తే ఇక్కడ చావే!

... 5వ పేజీ తరువాయి

మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి లేదంటే విశాఖపట్నం కేజీహెచ్ మార్చురీకి తీసు కెళ్లాల్సి వస్తున్నది.

చోడవరం సీహెచ్‌సీకి అనుబంధంగా పట్ట ణ శివారు తామరచెరువు సమీపంలో రూ.34 లక్షలతో కొత్తగా పోస్టుమార్టం సెంటర్ నిర్మాణం చేపట్టారు. పనులు దాదాపు పూర్త య్యాయి. స్వాధీనం చేసుకోవాలంటూ సంబం ధిత కాంట్రాక్టర్ చాలా రోజుల క్రితమే అధికా రులకు సమాచారం ఇచ్చారు. కానీ పోస్టు మార్టం చేయడానికి అవసరమైన సామగ్రి రాకపోవడంతో అధికారులు భవనాన్ని స్వాధీనం చేసుకోలేదని తెలిసింది. దీంతో కొత్త భవనంలో విద్యుత్ వైర్లు, ఇతర సామగ్రి చోరీకి గురవుతున్నాయి.

కె.కోటపాడు, మాడుగుల సీహెచ్‌సీలకు అనుబంధంగా చేపట్టిన పోస్టుమార్టం కేంద్రాల భవన నిర్మాణాలు దాదాపు పూర్తికావచ్చాయి. మిగిలిన కొద్దిపాటి పనులను త్వరగా పూర్తి చేసి, పోస్టుమార్టం సామగ్రి కూడా నెలకొల్పితే ఇది అందుబాటులోకి వస్తాయి. మృతదేహాలను పోస్టుమార్టం కోసం అనకాపల్లి, విశాఖపట్నం తరలించాల్సిన బాధలు తప్పుతాయి.


కల్యాణపులోవ జలాశయంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


బుచ్చెయ్యపేట: వడ్డాది శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు


గొలుగొండలోని ధారమటం ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

శంభో శివ శంభో

కన్నులపండువగా మహా శివరాత్రి వేడుకలు
శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో అన్ని మండలాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. అలాగే తెల్లవారు జాము నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు.

భక్తజన సంద్రంగా కల్యాణపులోవ

రావికమతం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని కల్యాణపులోవకు భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం, జలాశయం పరిసరాలు శివనామస్మరణతో హోరెత్తాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి చిన్న పిల్లలు మొదలు వృద్ధుల వరకు తరలివచ్చారు. అత్యధికులు స్థానిక రిజర్వాయర్‌లో పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో జలాశయం స్నాన ఘట్టాలు జనసంద్రంగా మారాయి. అనంతరం ఆలయంలో పోతురాజు బాబు, పెద్దింటమ్మ అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు తొలిరోజు వేలాది మంది భక్తులు తరలిరావడంతో రావికమతం- నర్సీపట్నం రోడ్డులో దొండపూడి రాణా నుంచి కల్యాణపులోవ వరకు రద్దీ నెలకొంది. పలువురు భక్తులు బుధవారం రాత్రి జాగారం చేసి, గురువారం తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించడానికి ఇక్కడే వుండిపోయారు. కాగా ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో వుండడంతో కల్యాణపులోవ ఉత్సవాల ఏర్పాట్లకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు దూరంగా వుండాల్సి వచ్చింది. దీంతో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది.. భక్తుల రద్దీకి తగినట్టు ఏర్పాట్లు చేయలేకపోయారు. దీంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. డీసీసీబీ అధికారులు భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, జీఎం శ్రీనివాసరావు, డీజీఎం అశోక్‌కుమార్, బీఎం దుర్గాప్రసాద్, నోడల్ ఆఫీసర్ రామకృష్ణ సహాయ సహకారాలు అందించారు. కాగా కల్యాణపులోవకు భక్తులు భారీగా తరలిరావడంతో పోలీసులు ద్విచక్ర వాహనాలు మినహా మిగిలిన అన్ని రకాల ప్రైవేటు వాహనాలను దొండపూడి రాణా వద్దే నిలిపివేశారు. అక్కడ నుంచి ఆర్టీసీ బస్సుల్లో కల్యాణపులోవ వెళ్లాలని సూచించారు. అయినప్పటికీ దొండపూడి రాణా నుంచి కల్యాణపులోవ వెళ్లే రోడ్డు చిన్నదిగా వుండడంతో పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. కొత్తకోట సీఐ జి.కోటేశ్వరావు ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్ క్లియర్ చేయడానికి చర్యలు చేపట్టారు.


రావికమతం: భక్తులకు మజ్జిక పంపిణీ చేస్తున్న డీసీసీబీ సీఈవో వర్మ


రావికమతం: కల్యాణపులోవ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

బ్రహ్మలింగేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

నర్సీపట్నం: మహా శివరాత్రి సందర్భంగా బలిఘట్టం త్రిముఖ పర్వత శ్రేణిపై వెలసిన రాజరాజేశ్వరి సహిత బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొలుత ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని గోత్ర నామాలతో పూజలు చేశారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. వరహానది తీరంలో ఉన్న దత్తాత్రేయ, పాకలపాటి గురుదేవుల ఆశ్రమాల్లో భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

స్వయంభూ గౌరీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

చోడవరం: పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరాలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్, కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే భక్తులు గౌరీశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని ముద్దుర్తిలో సంగమేశ్వరాలయం, జుత్తాడ, గవరవరం, రాయపురాజుపేటల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలోని పాతమల్లంపేటలో ఉమాధారమల్లేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జోగంపేట, గొలుగొండ, పాత మల్లంపేట, సాలికమల్లవరం, పాకలపాడు, కొత్తమల్లంపేట, గుండుపాల గ్రామాలతో పాటు నర్సీపట్నం డివిజన్‌లోని పలు గ్రామాల భక్తులు ఇక్కడ జలపాతంలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రామారావు పర్యవేక్షించారు.

కృష్ణాదేవిపేట: ఏఎల్‌పురం శివారులో అతి పురాతన నీలకంఠేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు ఉత్తరవాహిన బొడ్డేరు గెడ్డలో స్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొంగశింగిలో శివాలయంలో, ఏఎల్‌పురంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలో పలు శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. పైడిపాల వామలింగేశ్వరాస్వామి ఆలయంలో అభిషేకాలు చేశారు. పాపయ్యపాలెం కొండల్లో ఉన్న దారకొండ శివుడుకి భక్తులు పోటెత్తారు. అక్కడ కొండనుంచి వచ్చే నీటితో పుణ్య స్నానాలు ఆచరించి పూజలు చేశారు. శివాలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీల సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.


నర్సీపట్నం ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

నాతవరంలో...

నాతవరం: మండలంలోని చమ్మచింత ఉత్తర వాహిని దగ్గర భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గోత్ర నామాలతో అర్చకుల వద్ద బ్రహ్మముడులు వేసుకుని ఆశీర్వచనాలు తీసుకున్నారు. కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజలు చేశారు. అలాగే శ్రీశక్తి పంచాయతన ఆలయంలో జ్యోతిర్లింగార్చన పూజ, అఖండ దీపారాధన, రుద్రాభిషేకాలకు ఏర్పాట్లు చేశారు.

రోలుగుంటలో...

రోలుగుంట: మండలంలోని బుచ్చెంపేట మినీ కైలాసగిరి, నిండుగొండ, భ్రమరాంబిక సమేత మల్లికార్జున ఆలయం, రోలుగుంట శివాలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు.


నాతవరం: చమ్మచింత ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని సీతయ్యపేట రామభోగలింగేశ్వర, వడ్డాదిలో భ్రమరాంబిక సమేత మల్లిఖార్జునస్వామి, నామలింగేశ్వరస్వామి, పద్మలింగేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే విజయరామరాజుపేట, నిమ్మలోవ, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, రాజాం, నీలకంఠపురం, బంగారుమెట్ట ఆలయాల్లో స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరాఉ.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండలంలోని పలు శివాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.కోటపాడులో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి భీమలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మాజీ సర్పంచ్ దోకల లక్ష్మి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు ఎస్.రామునాయుడు, డి.ఎరుకునాయుడు, పూడి శ్రీను, కె.నాగభూషణం, బండారు నరసింహనాయుడు, జె.రాము, ఎస్.సన్యాసినాయుడు, బుల్లిదొర, పి.గోపి పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ: మండలంలో చీడికాడ, తురువోలు, ఖండివరం, ఎల్‌బి.పట్నం గ్రామాల్లోని శివాలయాల వద్ద వేకువజాము నుంచి భక్తులు బారులుతీరి పూజలు చేశారు. చీడికాడ శివాలయంలో అర్చకులు ఈశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. అలాగే సాయంత్రం మహిళలతో కోలాటాలు నిర్వహించారు.


దేవరాపల్లి: తిమిరాం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. దేవరాపల్లి వనదేవీశ్వర, తిమిరాం, బి.కింతాడ, తెనుగుపూడి, పెదనందిపల్లి, చిన నందిపల్లి, ఎం.అలమండ గ్రామాల్లో ఉమామహేశ్వరీ దేవీ, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్తరవాహినిలో నేత్రపర్వంగా జలహారతి

నర్సీపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి బలిఘట్టం ఉత్తరవాహినిలో జలహారతి నేత్ర పర్వంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ధూప, దీప, కుంభ, నక్షత్ర, మంగళ హారతి పట్టారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి గంగాదేవికి పట్టు చీర సమర్పించారు. అర్చకులు భద్రాచల రామం, ఆదిత్య, పవన్‌లు జలహారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.


గంగాదేవికి పట్టుచీర సమర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబీకులు

ఆధ్యాత్మిక ప్రాంతంగా నర్సీపట్నం: స్పీకర్

బలిఘట్టం ఉత్తరవాహిని వద్ద కంచి పీఠం శాఖను ఏర్పాటు చేస్తే నర్సీపట్నం ఆధ్యాత్మిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. జలహారతి కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గతంలో కంచి పీఠాధిపతి నర్సీపట్నం వచ్చినప్పుడు, ఇక్కడ కంచి పీఠం ఏర్పాటు చేయాలని కోరానని తెలిపారు. ఇందుకోసం ఐదు ఎకరాల స్థలం కావాలని కంచిపీఠాధిపతి అడిగారని, సత్యనారాయణస్వామి గుడి ఎదురుగా ఉన్న మూడున్నర ఎకరాలు స్థలం ఖాళీగా ఉందని తెలిపారు. ఆ స్థలాన్ని కంచి పీఠం కోసం ఇస్తామని చెప్పామన్నారు. ఇక్కడికి కంచిపీఠం వస్తే నర్సీపట్నం ఆధ్యాత్మిక ప్రాంతంగా మారిపోతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కొత్తగా సత్యనారాయణస్వామి గుడి నిర్మాణం చేసి, ఇటీవల అన్నవరం దేవస్థానానికి దత్తత ఇచ్చామని తెలిపారు. గురువారం ఉత్తరవాహినికి వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ సురేంద్ర, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గోవిందరావును ఆదేశించారు. సత్యనారాయణస్వామి ఆలయ ధర్మకర్త శెట్టి మోహన్, చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, ట్రైనీ డీఎస్పీ చైతన్య పాల్గొన్నారు.

వైభవంగా పోతురాజుబాబు తీర్థ మహోత్సవం

మాడుగుల ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివారు తూరిబిల్లి, మామిడి వారి కళ్లాల సమీపంలో బుధవారం పోతురాజుబాబు తీర్థ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతీ ఏడాది మాదిరిగా ఈ ఏడాది శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ తీర్థంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడుతో పాటు పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకుని, ప్రసాదాన్ని స్వీకరించారు. తీర్థం సందర్భంగా కమిటీ సభ్యులు వేకువజామునుంచి పోతురాజుబాబు ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. అలాగే తీర్థంలో నిర్వహించిన టైరు ఎడ్ల బండ్ల పరుగు పోటీలు భక్తుల్లో ఉత్సాహాన్ని నింపాయి. విజేతలకు నగదు బహుమతులు అందించారు. మహిళలతో నిర్వహించిన కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే మాడుగుల శివారు ఖండివరం వెళ్లే దారిలో శివపార్వతులు తీర్థం నిర్వహించారు. మాడుగుల కేంద్రంలో గల శివాలయాలతో పాటు ఎం.కోడూరు, జంపెన ప్రాంతాల్లో శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


తీర్థంలో మహిళల నృత్య ప్రదర్శనలు

9232 మంది రైతులకు పీఎం కిసాన్ నిధులు విడుదల

రోలుగుంట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 19వ విడత పీఎం కిసాన్ కింద 9232 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ.2 వేలు చొప్పున జమయ్యాయని మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. 24 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే జమయ్యాయన్నారు. సీఎస్సీ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకుంటే మిగిలిన వారికి డబ్బులు పడతాయని ఆమె తెలిపారు.

హోరాహోరీగా గుర్రం పరుగు పోటీలు


తురువోలు మైదానంలో పరుగులు తీస్తున్న గుర్రాలు

చీడికాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురువోలు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం హోరాహోరీగా ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలు జరిగాయి. మహాశివరాత్రి సందర్భంగా జరిగిన ఈ పోటీలకు 18 గుర్రాలు పోటీ పడ్డాయి. గ్రౌండ్‌లో గుర్రాలు తీస్తున్న పరుగులు చూసి భక్తులు కేరింతలు కొట్టారు. మొదటి బహుమతి చోడమాంబిక (రామన్నపాలెం) గుర్రానికి రాగా, రెండు, మూడు, నాలుగు బహుమతులు మోదమాంబ మరుగన్, మోదమాంబ విజయ్ (అంకుపాలెం), దాడి నూక హనుమంతు (ఆర్‌ఆర్‌పే) గుర్రాలకు వచ్చాయి. మిగతా నాలుగు బహుమతులు వివిధ గ్రామాలకు చెందిన గుర్రాలకు దక్కాయి. మాజీ ఎంపీపీ పాత్రిని సింహాచలంనాయుడు, సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పిటి.బాబు, ఎంపీటీసీ సభ్యుడు బీశ్ల కోటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు విజేతలకు నగదు బహుమతులను అందించారు.

ఘనంగా పేరంటాళ్ల తీర్థం


ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తిని సత్కరిస్తున్న సభ్యులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒడ్డు చింతల కళ్లాల్లో పేరంటాళ్ల తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎడ్ల పరుగు పోటీల విజేతలకు ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి బుధవారం బహుమతులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. మాజీ ఎంపీపీ కిపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, కూటమి నాయకులు రామ్మూర్తినాయుడు, అవుగడ్డ కోటి పల్లినాయుడు, చెరకాన సూర్యనారాయణ, రెడ్డి బలరామమూర్తి పాల్గొన్నారు.

వడ్డాది వెంకన్న కల్యాణ రాట


అర్చకులు, ఆలయ ధర్మకర్తలతో కలిసి పందిర రాట వేస్తున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వడ్డాది గిరిజాంబగిరిపై కొలువైన శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి 152వ వార్షిక కల్యాణ మహోత్సవాలకు బుధవారం రాట ప్రతిష్ఠించారు. అర్చకులు శ్రీకాంత్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు అన్న కుమారుడు శ్రీరామ్ పూజలు జరిపి రాట వేశారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్వామివారిని దర్శించుకున్నారు. మార్చి 9న స్వామివారి దొంగపెళ్లితో ఉత్సవాలు ప్రారంభమై 15వ తేది పుష్పాంజలిసేవతో ముగుస్తాయని ఈ సందర్భంగా ధర్మకర్త కన్నబాబు తెలిపారు. డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, కూటమి నేతలు ఎ.నరసింహమూర్తి, డి.సన్యాసిరావు, డి.నరేశ్, డి.నానాజీ, ఎస్ఎస్ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

మైదానం కాదు.. చెరువే!

అడుగంటిన స్వల్ప నీటిపై కుంకుమ, పచ్చని రంగులో నాచుపట్టి
ఆహ్లాదకరంగా కనిపిస్తున్న పాండవుల చెరువు

ఈ ఫొటోల్లో కనిపిస్తున్న ప్రదేశాన్ని చూస్తుంటే ఇదేదో క్రీడా మైదానంలా అనిపిస్తుంది కదూ... అలా అనుకుంటే పొరపాటు పడినట్టే! మాడుగులలోని మోదకొండమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే పాండవుల చెరువు ఉంది. మెట్టను అనుకుని ఉన్న చెరువులో నీటిని ఉపయోగించుకుని సుమారు 50 ఎకరాల ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకుంటుంటారు. నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నప్పుడు ఈ చెరువు పచ్చని పైరుతో చూపరులకు ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ చెరువులో నీటి నిల్వలు తగ్గాయి. ఉన్న కొద్దిపాటి నీటిపై పచ్చని మొక్కలు పెరగడంతో పాటు మరి కొంత భాగం కుంకుమ రంగులో నాచు పట్టడంతో చూపరులకు కనువిందు చేస్తున్నది. నీటి జాడే కనిపించకుండా ఉండడంతో క్రీడా మైదానాన్ని తలపిస్తోంది. ఇది క్రీడా మైదానమా? చెరువా? అనే సందిగ్ధతకు గురయ్యేలా చూపరులు ఆకట్టుకోవడం విశేషం.

-మాడుగుల/మాడుగుల రూరల్, ఆంధ్రజ్యోతి






సీలేరులో శివలింగానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు


ఆలయంలో భక్తుల రద్దీ


కొయ్యూరులో మల్లికార్జునస్వామికి పూజలు


ఆలయం ఎదుట భక్తులు

హర హర మహాదేవ

- ఘనంగా మహా శివరాత్రి
- కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- నీలకంఠునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- ఆలయ ఆవరణల్లో అన్న సమారాధనలు
- ప్రముఖ ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నిరాకారుడు.. నిత్య చైతన్య సంపన్నుడు.. మారేడు దళం, నీళ్లతో కొలిస్తేనే పరవశించి కోర్కెలు తీర్చే భోళాశంకరుడు. ఎన్ని దేవుళ్లను పూజించినా చివరికి ముక్తి మార్గానికి ఆ అర్ధనారీశ్వరుడికి మొక్కాల్సిందే... అందుకే మహాశివరాత్రికి ఆ నిష్కామునికి జనాలు నీరాజనాలందిస్తారు. ఈ నేపథ్యంలో బుధవారం అల్లూరి జిల్లాలో శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆ కాల పురుషుడిని కొలిచారు.

పాడేరురూరల్, ఫి బ్రవరి 26 (ఆం ధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పలు గ్రామాల్లో శివాలయాలు బుధవారం శివనామ స్వరణతో మార్మోగాయి. పాడేరు గిరికైలాస క్షేత్రంలో ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు పంచామృతాభిషేకాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నా యుడు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. టీటీడీ, హిందూ ధర్మపరిషత్ ఆధ్వర్యంలో అభిషేకాలు, బిల్వదళార్చనలను జరిపారు. హరికథాగానం తదితర ఆధ్యాత్రిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.ఉషారాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కె.సుబ్బారావు, బి.నాగరాజు, ఉపసర్పంచ్ బి.రామునాయుడు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి యువీ.రత్నం, మాజీ ఎంపీపీ వర్తన ముత్యాలమ్మ, వర్తన పిన్నయ్యదొర, కె.రామారావు, వర్తక సంఘం అధ్యక్షుడు ఐ. అనీల్‌కుమార్, మహిళా అధ్యాత్మిక సేవాసంఘం మహిళా సభ్యులు చీపురు రమాదేవి, రమణమ్మ పాల్గొన్నారు. మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలోని సిద్ధిసంగమేశ్వరాలయంలో ప్రధాన అర్చకులు సాయి ప్రశాంత్ శర్మ ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ గ్రామాల భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని జేసీఎంజే.అభిషేక్ గౌడ, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కె.భాగ్యలక్ష్మి దంపతులు, టీడీపీ నాయకులు పి.పాండురంగస్వామి, జనసేన పార్టీ నాయకులు వంపూరు గంగులయ్య తదితరులు పాల్గొన్ని స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. బుధవారం రాత్రి 8.30 గంటల నుంచి ఆలయంలో రుద్ర హోమం, మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బ్రహ్మకుమారీలు విజయ, శారద, శాంతి, సుమిత్ర, జయ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పాడేరులోని త్రిముఖలింగేశ్వస్వామి ఆలయం, స్వయం భూలింగేశ్వస్వామి ఆలయం, మండలంలోని నక్కలపుట్టు, వర్తనాపల్లి, తుంపాడ తదితర గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కొయ్యూరు: కొయ్యూరు మల్లికా ర్జునస్వామి దేవాలయంలోని భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆ య వంశపారంపర్య ధర్మకర్త ఎంవీవీ ప్రసాద్ స్వామి వారి కల్యాణానికి వీలుగా పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి. మాకవరం పురాతన శివాలయం వద్ద భక్తులు బా రులు తీరారు. సమీప కొండవాగు ప్రవాహంలో పుణ్య స్నానాలకు భక్తులు పోటీపడ్డారు. భక్తులకు ఉత్సవ కమిటీ మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేసింది. వలసంపేట గిరిజా సమేత తాండవేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ డి. చిట్టిబాబు, లోతా భీమరాజు, దేముడు, వీహెచ్‌పీ ప్రతినిధులు మల్లిబాబు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు కొనసాగాయి. యు. ఛీడిపాలెం శివారు పూతి గుంటలో శివరాత్రి వేడుకలు నిర్వహించారు. పెద మాకవరంలో నడింపాలెంనకు చెందిన పల్లా ఏసుబాబు ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. చింతలపూడిలో దుర్గా మల్లేశ్వర ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు, జూదం, కోడిపందాలు నిర్వహించకుండా కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్ఐ కిశోర్‌వర్మ ఆధ్వర్యంలో సి బ్బంది బం దోబస్తు నిర్వహించారు. అలాగే, పోతురాజు బాబు పండగకు పురస్కరించుకుని పలు గ్రామాలలో విద్యుత్తు అలకరణలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పండగ వాతావరణం నెలకొంది.


పాడేరు ఉమానీలకంఠేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

భక్తులతో కిటకిటలాడిన బౌడ శివాలయం

చింతపల్లి: మండలంలోని బౌడ శివాలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చింతపల్లి, జీకేవీధి, జి.మాడుగుల మండలాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. నిర్వాహకులు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో వివేకానంద ట్రస్టు వైద్యులు ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు నగేశ్ శర్మ, గ్రామపెద్దలు పొట్టిదొర, కన్నయ్యపడాల్, రాంబాబు, డాక్టర్లు అజయ్, హరిప్రియ పాల్గొన్నారు.

జి. మాడుగులలో...

జి.మాడుగుల: సంతబయలు, గెమ్మెలి పంచాయతీ కుల్లుపాడు, రాళ్లపుట్టు, సింగర్బ పంచాయతీ మధుమామిడి, ఉబలగరువు, నుర్మతి తదితర శైవ క్షేత్రాల్లో భక్తులు పూజలు చేశారు. అలాగే హుకుంపేట మం డలం, మత్స్యగుండం, నర్సీపట్నం ఏరియా బలిఘట్టంలలోని ప్రసిద్ధి దేవవాలకు మండలం నుంచి భక్తులు తరలి వెళ్లారు.

సీలేరులో..

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు, ధారకొండ, ఒడిశా సరిహద్దుల్లోని గుంటవాడ శివాలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి శివనామ స్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా వేదపండితులు శివలింగాలకు అభి షేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సీలేరు శివాలయంలో మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం ఆలయంలో దీపాలంకరణ, ప్రత్యేక భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ధారకొండ శివాలయం వద్ద మహా శివరాత్రి వేడుకలు ఐదు రోజుల పాటు నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. గుంటవాడ సమీపంలోని శివాలయానికి గిరిజన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అరకులోయలో..

అరకులోయ: మండలంలో మహాశివరాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అరకులోయ పట్టణంలో ఉన్న భ్రమరాంబ సహిత మల్లేశ్వర స్వామి ఆలయంతో పాటు పాణిరంగిణి, సుంకరమెట్ట తదితర శివాలయాలకు భక్తులు వేకువజామునుంచి బారులుతీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అరకులోయ ఆలయంలో మధ్యాహ్నం మూడు గంట సమయంలోభక్తులు1008 బిందెల నీళ్లతో స్వామివారికి అభిషేకం జరిపారు. ఆలయాల ప్రాంగణాల్లో మధ్యాహ్నం అన్న సమారాధనలు చేపట్టారు.

డుంబ్రిగుడ: మండలంలోని కురిడిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో భక్తులు బారులు తీరారు. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ ధర్మకర్త మండలి ప్రతినిధులు మధ్యాహ్నం మూడువేలమంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయం త్రం 4 గంటలకు 1008 బిందెలతో స్వామి వారికి జలభిషేకాన్ని నిర్వహించారు. శివపార్వతులకు కల్యాణాన్ని నిర్వహించి ఘనంగా ఊరేగించారు. గిరిజన సంప్రదాయ థింసా నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


ఉమానీలకంఠేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ


సంగోడి సంగమేశ్వర ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు


ఆర్టీసీ బస్సులో మత్స్యగుండం వెళ్తున్న భక్తులు


కొయ్యూరు: పురాతన పెదమాకవరం క్షేత్రంలో భక్తులు

గూడెంకొత్తవీధి: మండలంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని నిమ్మలపాలెం, ఆర్‌వీనగర్, అంతర్ల శివాలయాల్లో ప్రత్యేక అర్చనలు, పూజలు జరిగాయి. అంతర్ల శివాలయంలో స్థానిక తహసీల్దార్ రామకృష్ణ అభిషేకం చేశారు. అనంతరం భక్తుల కోసం నిర్వాహకులు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈపూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దారెల శివాలయంలో యాగం

ముంచంగిపుట్టు: మండల పరిధిలో తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దారెల, కుమడ, చెరువుపాకల, జోలాపుట్టు, కరిముఖిపుట్టు, పాత ముంచంగిపుట్టు, కిలగాడ, మండల కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో పరమేశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. దారెల శివాలయం ఆవరణలో రాత్రి హోమం జరిపారు. సర్పంచి పాండురంగస్వామి దంపతులు పరమేశ్వరుడికి వస్త్రాలను సమర్పించి, ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్స్యగుండంకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పాడేరురూరల్: హుకుంపేట మండలం మఠం పంచాయతీ మత్స్యగుండం మత్స్యలింగేశ్వరస్వామి దర్శనానికి పాడేరు ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి వందలాది భక్తులు తరలివెళ్లారు. ఇందుకనుగుణంగా పాడేరు డిపో ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ టి.ఉమామహేశ్వరరావు 24 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. ఈ బస్సులు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పాత బస్టాండ్, సాయిబాబా ఆలయ ప్రాంగణం సుండ్రుపుట్టు నుంచి మత్స్యగుండం వరకు నడిపారు.


దారెల శివాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సర్పాల సయ్యాట

- సీతగుంట భీమేశ్వర ఆలయ సమీపంలో ప్రత్యక్షం


ఆలయ ప్రాంగణంలో సర్పాలు

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ కేంద్రంలోని భీమలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రిరోజున రెండు సర్పాలు దర్శనమివడం భక్తులు పరవశించిపోయారు. ఆలయ పూజారి శ్రీనివాస శర్మ నివాసముంటున్న సమీపంలో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సర్పాలు సయ్యాటలాడాయి. దీంతో ప్రధాన రహదారిలో వెళ్లే ప్రజలు అసక్తిగా తిలికించి సెల్‌ఫోన్‌లలో వీటిని బంధించారు.

యువత చదువులో రాణించాలి: ఎస్పీ

పెదబయలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : గిరిజన యువత చదువుల్లో రాణించాలని ఎస్పీ అమిత్ బర్దార్ సూచించారు.బుధవారం మండలంలోని మారుమూల జామిగుడ పంచాయతీ గుంజివాడ గ్రామాన్ని సందర్శించారు. శివరా త్రివేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గిరిజనులతో ఆయన మమేకమై మాట్లాడారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తును మెరుగు పరుచుకోవాలని సూచించారు. అలాగే స్థానికంగా నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానిక ఎస్ఐ రమణకు ఆదేశించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న బాపనమ్మ బాల లింగేశ్వరి దేవత పూజలో ఎస్పీ, ఏఎస్పీలు పాల్గొన్నారు. అనంతరం తారాబు జలపాతంలో సందర్శించి ప్రాంగంణాన్ని పరిశీలించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. గుంజివాడ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అతని పాటు స్థానిక సర్పంచ్ అన్నమ్మ,వెంకటరావు, మాజీ ఎంపీపీ జె. బాలంనాయుడు పాల్గొన్నారు.

చస్తే ఇక్కడ చావే!

... 5వ పేజీ తరువాయి

మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి లేదంటే విశాఖపట్నం కేజీహెచ్ మార్చురీకి తీసు కెళ్లాల్సి వస్తున్నది.

చోడవరం సీహెచ్‌సీకి అనుబంధంగా పట్ట ణ శివారు తామరచెరువు సమీపంలో రూ.34 లక్షలతో కొత్తగా పోస్టుమార్టం సెంటర్ నిర్మాణం చేపట్టారు. పనులు దాదాపు పూర్త య్యాయి. స్వాధీనం చేసుకోవాలంటూ సంబం ధిత కాంట్రాక్టర్ చాలా రోజుల క్రితమే అధికా రులకు సమాచారం ఇచ్చారు. కానీ పోస్టు మార్టం చేయడానికి అవసరమైన సామగ్రి రాకపోవడంతో అధికారులు భవనాన్ని స్వాధీనం చేసుకోలేదని తెలిసింది. దీంతో కొత్త భవనంలో విద్యుత్ వైర్లు, ఇతర సామగ్రి చోరీకి గురవుతున్నాయి.

కె.కోటపాడు, మాడుగుల సీహెచ్‌సీలకు అనుబంధంగా చేపట్టిన పోస్టుమార్టం కేంద్రాల భవన నిర్మాణాలు దాదాపు పూర్తికావచ్చాయి. మిగిలిన కొద్దిపాటి పనులను త్వరగా పూర్తి చేసి, పోస్టుమార్టం సామగ్రి కూడా నెలకొల్పితే ఇది అందుబాటులోకి వస్తాయి. మృతదేహాలను పోస్టుమార్టం కోసం అనకాపల్లి, విశాఖపట్నం తరలించాల్సిన బాధలు తప్పుతాయి.


కె.కోటపాడు సీహెచ్‌సీలో తుదిదశలో వున్న పీఎం భవనం

జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

... 5వ పేజీ తరువాయి

కేంద్రంలో అత్యల్పంగా 26 మంది ఓటర్లు వున్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి: కలెక్టర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. స్థానిక జీవీఎంసీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఉదయం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ ప్రారంభం నుంచి బ్యాలట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకు ఎన్నికల కమిషన్ నిబంధనలకు తు.చ. తప్పకుండా పాటించాలని అన్నారు. ఎన్నికల సామగ్రిని పూర్తిగా పరిశీలించి, అన్నీ సక్రమంగా వున్న తరువాతే పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలని సూచించారు. అనంతరం ఎన్నికల సిబ్బంది ఆయా కౌంటర్ల వద్దకు వెళ్లి పోలింగ్ సామగ్రి తీసుకున్నారు. మధ్యాహ్న భోజనం తరువాత ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు షేక్ ఆయిషా, వీవీ రమణ, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, డీఎస్పీ ఎం.శ్రావణి, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ నాయుడు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

'ప్రాథమిక పాఠశాలల విలీనం తగదు'

పాడేరురూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను జీవో 117 ప్రకారం 3, 4, 5 తరగతుల విద్యార్థులను కిలో మీటరు లోపు ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆదివాసీ మాతృభాషా ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.చిట్టిబాబు, పి.శ్రీను డిమాండ్ చేశారు. ఆ విధంగా చేస్తే జిల్లాలో 350 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో విద్య పూర్తిస్థాయిలో అందని విధంగా ఉందన్నారు. ఈ జీవోతో మారుమూల గ్రామాల విద్యార్థులకు విద్య మరింత అందని ద్రాక్షగా మారుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ విషయంపై పునరాలోచన చేయాలని వారు కోరారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

నియమించారు. ఎన్నికల సిబ్బంది, మెటీరియల్‌ను బుధవారం సాయంత్రానికే కేంద్రాలకు తరలించారు. ఎన్నిక బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్నారు. పోలింగ్ నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు...

సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోరెడ్ల విజయగౌరి, గాదె శ్రీనివాసులనాయుడు, కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, సత్తలూరి పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, పోతల దుర్గాప్రసాద్, సుంకర శ్రీనివాసరావు (ఈయన పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం క్రితం ప్రకటించారు)

ఓటు హక్కు ఎవరికి ఉంటుందంటే...

ఉన్నత పాఠశాలల్లో బోధన చేసే స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు, జూనియర్/డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, యూనివర్సిటీ కళాశాలల అధ్యాపకులు, ప్రైవేటు పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్ కేడర్‌లో ఉన్న టీచర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఓటరు ప్రాధాన్యతా క్రమంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఒక అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేస్తున్నట్టు అయితే పేరుకు ఎదురుగా ఉన్న గడిలో 'ఒకటి' అని నంబరు వేయాలి. అంతే తప్ప టిక్‌లు పెట్టరాదు. ఓటరుకు బ్యాలెట్ పేపరుతోపాటు స్కెచ్ పెన్ను ఇస్తారు. ఆ పెన్ మాత్రమే ఉపయోగించి ఓటువేయాలి తప్ప ఇతర పెన్నులు వాడరాదు.

మూడో తేదీన ఓట్ల లెక్కింపు

ఎన్నికలలో కీలకమైన పోలింగ్ గురువారం సాయంత్రం నాలుగు గంటలతో ముగియనున్నది. నగరంలోని పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను సాయంత్రం ఆరు గంటల తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం బ్లాక్‌లో భద్రపరుస్తారు. మిగిలిన జిల్లాల నుంచి గురువారం రాత్రికి బ్యాలెట్‌బాక్సులు వస్తాయి. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. దీనికి సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి రెండు రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

పండగ పూట విషాదం

... 5వ పేజీ తరువాయి

విభీషణరావు తెలిపారు. కాగా మహాశివరాత్రి పర్వదినాన గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందడంతో పెనుగొల్లులో విషాదఛాయలు అలముకున్నాయి.

చెట్టుకి ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నర్సీపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం నడింపాలెం పంచాయతీ కంపరేగల గ్రామానికి చెందిన పనసల చంద్రశేఖర్(22) ఇంటర్ పూర్తిచేశాడు. నర్సీపట్నంలోని ఒక ప్రైవేటు వస్త్ర దుకాణంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతని అన్న గోవింద్ డౌనూరు గ్రామ సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరూ నర్సీపట్నంలో నివాసం ఉంటున్నారు. అడవిరాజులుబాబు పండగ సందర్భంగా మంగళవారం కంపరేగల వెళ్లారు. అయితే చంద్రశేఖర్ కొంతకాలం నుంచి మద్యానికి బానిస అయ్యాడు. ఈ దుర్వ్యసనాన్ని మానేసి బుద్ధిగా పని చేసుకోమని అన్న గోవింద్ మందలించాడు. ఇద్దరూ కలిసి మంగళవారం సాయంత్రం తిరిగి నర్సీపట్నం వచ్చారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో కంపరేగల వెళ్లిపోతానని చంద్రశేఖర్ చెప్పడంతో గోవింద్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వదిలిపెట్టి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రోజూ మాదిరిగానే వాకింగ్ వచ్చిన వారు.. టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వెనుక ఉన్న చెట్టుకు ఓ యువకుడు ఉరివేసుకుని వేలాడుతుండడాన్ని చూసి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బందితో స్టేడియం వద్దకు వెళ్లి పరిశీలించారు. చెట్టు పక్కన ఉన్న సిమెంటు బెంచీ మీద బ్యాగ్, చిన్న కత్తి, ఒక అద్దం, ఊడిపోయిన కళ్ల జోడు కనిపించాయి. బ్యాగ్‌లో ఉన్న పర్సులో ఆధార్ కార్డు, పేపర్లు మీద రాసి వున్న ఫోన్ నంబర్లు చూశారు. ఆధార్ కార్డులో ఉన్న చిరునామా ఆధారంగా ఆత్మహత్య చేసుకున్న యువకుడు కొయ్యూరు మండలం కంపరేగల గ్రామానికి చెందిన పనసల చంద్రశేఖర్‌గా గుర్తించారు. అనంతరం అతని సోదరుడు గోవింద్‌కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. సీఐ గోవిందరావు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం చేయించారు. సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం రాజుపాలెం వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. రాజుపాలెం రైల్వే గేటు సమీపాన విశాఖ నుంచి విజయవాడ వైపు రైళ్లు వెళ్లే ట్రాక్ పక్కన గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్టు అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడు 5.3 అడుగుల ఎత్తు, 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉంటాడని ఆమె తెలిపారు. పసుపురంగు హాఫ్ హ్యాండ్ టీషర్టు, నేవీబ్లూ ఫుల్‌ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. అతని వివరాలు తెలిసిన వారు 73820 58996 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడి విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద గల ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను రథంలో ఉంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. దారి పొడవునా భక్తులు దర్శించుకున్నారు. నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయానికి ఊరేగింపు చేరుకుంది. అక్కడి నుంచి సాయంత్రం అండర్‌బ్రిడ్జి వద్ద గల ఆలయానికి చేరుకుంది. రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ల సంఘం శాశ్వత గౌరవాధ్యక్షులు కోసూరి మన్మథరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి తుంపాల సతీష్, కామాక్షి కార్పెంటర్స్ సంఘం సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు



సబ్బవరం పాఠశాలలో సామగ్రిని సరిచూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

సబ్బవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరగనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించి ఇక్కడి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఓటర్లకు తాగునీరు, పోలింగ్ కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు వంటి వాటిని సిద్ధం చేశారు. వికలాంగుల కోసం ర్యాంపు వేశారు. బుధవారం సాయంత్రం సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఎంపీపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరిన సామగ్రి, బ్యాలెట్ పేపర్లు తదితరాలను ఎన్నికల సిబ్బంది సరిచూసుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ ఆఫీసర్ మోహనరావు మాట్లాడుతూ సబ్బవరంలో 94 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 50 మంది పురుషులు, 44 మంది మహిళా ఓటర్లుగా పేర్కొన్నారు. పోలింగ్ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందుకోసం గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

సబ్బవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గుల్లేపల్లిలో మార్చి తొమ్మిదో తేదీన లక్ష్మీగణపతి, కనకమహాలక్ష్మి, నాగబంధ సమేత కోదండ రామస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఇక్కడ ఎంపీపీ బోకం సూర్యకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడో తేదీన ఈ వేడుకలు ప్రారంభమై తొమ్మిదో తేదీతో ముగుస్తాయన్నారు. ప్రతిరోజూ విశేష పూజలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, సర్పంచ్ బండారు మంగ, బండారు శ్రీను, అప్పల ఈశ్వరరావు, కొల్లూరి రమేశ్, ఎస్.నారీబాబు, జి.దేముడుబాబు, పాటూరి కృష్ణ, బీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల ధర్నా



డిపో ఎదుట వేకువ జామున ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలంటూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు బుధవారం వేకువ జామున ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, కండక్టర్ ఎస్ఎస్ నారాయణ అక్రమ సస్పెన్షన్ ఎత్తి వేయాలని, సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాలను ఉల్లంఘించి డీఎంపై చర్యలు తీసుకోవాలని, సీఅండ్‌టీ కేసుల్లో పాయింట్ల విధానం అమలు పరచాలని, టిమ్ డ్రైవర్స్‌పై వేధింపులు ఆపాలని, అక్రమ కేసులు రాస్తున్న తనిఖీదారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బల్లాట ఆడుతున్న నలుగురి అరెస్టు

కశింకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏఎస్‌పేట గ్రామ శివారున బల్లాట ఆడుతున్న నలుగుర్ని బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా బల్లాట సామగ్రితో పాటు రూ.2,630 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఒకరి మృతి



వెంకటరావు(ఫైల్)

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ తీవ్ర గాయాలకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడని పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెట్రోల్ బంకులో పని చేసే కశింకోట పూసర్లవీధికి చెందిన గొలగాని వెంకటరావు(54) 15 ఏళ్లుగా కొత్తూరులో నివాసముంటున్నారు. ఈ నెల 21వ తేదీన టీ తాగడానికి కొత్తూరు జంక్షన్‌కు వచ్చి ప్రమాదవశాత్తూ నేలకొరిగాడు. అతని తలకు గాయం కావడంతో ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ వైద్యులు ఆపరేషన్ చేశారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడంతో అతని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేజీహెచ్‌లో శవ పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.



సబ్బవరం మండలం దేవీపురం దక్షవాటిలో భక్తుల ప్రదక్షిణలు



పరవాడలోని పంచముఖ ఆంజనేయ ఆలయం వద్ద దీపారాధన



కశింకోట : బంగారయ్యపేట శ్మశాన వాటికలో శివుని విగ్రహం ప్రతిష్ఠ

సర్వం శివమయం

- అత్యంత భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వేకువజాము నుంచి విశేష పూజలు
- ఆకట్టుకున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు



రామాపురం శివాలయంలో పూజలు



అనకాపల్లిలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, అర్చకులు క్షీరాభిషేకం



పరవాడ మల్లికార్జునస్వామి ఆలయంలో..

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినాన్ని అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల ప్రజలంతా బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువ జాము నుంచి శైవక్షేత్రాల వద్ద స్వామి దర్శనానికి బారులుతీరారు. అర్చకులో భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. అన కాపల్లి పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, భోగలింగేశ్వర, సిద్ధిలింగేశ్వర, ఉమా రామలింగేశ్వర ఆలయాలతో పాటు కొబ్బరికాయల మార్కెట్ వద్ద గల శివాలయాల్లో స్వామివారికి విశేష అర్చనలు జరిపారు. మహిళలు ధ్వజస్తంభాల వద్ద దీపారాధన చేశారు. భోగలింగేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓం నమః శివాయ నామస్మరణతో అర్థ ఏకాహం నిర్వహించారు. స్వామివారిని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, న్యాయమూర్తి ఎ.రమేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శారదా నదిలో పలువురు భక్తులు స్నానాలు చేసి, ఆ ఒడ్డున గల ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. లక్ష్మీదేవిపేట రైల్వేగేటు సమీపంలో సద్గురు రాజర్షి ఆత్మానందస్వామి ఆధ్వర్యంలో జ్యోతిర్లింగాలకు రుద్రాభిషేకాలు, పదకొండు అడుగుల శివలింగానికి పూజలు నిర్వహించారు.

కొత్తూరు : రామాపురం, వెంకుపాలెం, వేటజంగాలపాలెం, కూండ్రం తదితర గ్రామాల్లో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

తుమ్మపాల : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తుమ్మపాల, మార్టూరు, దిబ్బపాలెం గ్రామాల్లో గల శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధనలు జరిపారు. మార్టూరులో పురాతన శివాలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు చెక్కులను ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

పరవాడ మండలంలో...

పరవాడ : మండల వ్యాప్తంగా శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. పరవాడలోని మల్లికార్జునస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, పాలాభిషేకంతో పాటు హోమం నిర్వహించారు. ఎంపీడీవో కె.ధర్మారావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు తదితరులతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తాడి గ్రామంలోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం, మహాన్యాస రుద్రాభిషేకం, సహస్రనామార్చన, పాలాభిషేకం, కుంకుమ పూజలు చేపట్టారు. మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు దంపతులతో పాటు భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అలాగే, లేమర్తి, స్వయంభూవరం, భరణికం, దేశపాత్రునిపాలెం శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రాత్రికి గ్రామాల్లో సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి దీపారాధన జరిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై దేవతామూర్తుల ఆకారంలో దీపాలు వెలిగించి స్వామిని దర్శించుకున్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆది దంపతులను దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు బారులుతీరారు. దేవీపురంలోని దక్షవటి, లింగాలతిరుగుడు, వంగలిలోని సోమలింగేశ్వరస్వామి, పెదయాతపాలెంలో గౌరీపరమేశ్వరుల సహిత ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం, గొర్లివానిపాలెంలోని ఉమారామలింగేశ్వరస్వామి, గణపతిపురంలో మల్లికార్జునస్వామి, ఇరువాడలో భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పలుచోట్ల మధ్యాహ్న అన్నసమారాధన జరిపారు. రాత్రికి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వర స్వామిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు దొడ్డి సూర్యప్రకాశరావు తదితరులు ఆయనను ఘనంగా సత్కరించారు.

కశింకోట మండలంలో...

కశింకోట : మండలంలోని గ్రామ గ్రామాన గల శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తాళ్లపాలెం, నర్సింగబిల్లి, కన్నూరుపాలెం, ఏఎస్‌పేట, పల్లపు సోమవరం, వెదురుపర్తి తదితర గ్రామాల్లోని ఆలయాలకు మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి స్వామి, అమ్మవార్లకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆయా ఆలయాల వద్ద అన్నసమారాధన జరిపారు. రాత్రికి పలుచోట్ల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఇదిలావుంటే, తాళ్లపాలెం పరిధిలో ఉన్న బంగారయ్యపేట శ్మశానవాటికలో శివుని విగ్రహాన్ని ఆవిష్కరించారు

వెంకుపాలెంలో ఘనంగా లక్ష్మణమ్మతల్లి ఉత్సవం



ఉత్సవ విగ్రహం ఊరేగింపులో భక్తులు



పూజలందుకున్న అమ్మవారు

కొత్తూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మం డలం వెంకుపాలెంలో బాల పేరంటాలు లక్ష్మణమ్మతల్లి తీర్థం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన జరిపారు. సాయంత్రం మేళతాళాలు, కోలాటాల నడుమ శారదా బ్రిడ్జి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకు వెళ్లారు.

మొగలిపురంలో ఎడ్లబండ్ల పరుగు పోటీలు



పోటీలో పరుగు తీస్తున్న ఎద్దులు

సబ్బవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మొగలిపురంలో వీరాంజనేయస్వామి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ,అరుణ దంపతులతో పాటు గండి రవికుమార్ తదితరులు దర్శించుకున్నారు. ఇదిలావుంటే, ఈ వేడుక సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పరుగు పందేలు నిర్వహించారు. ఇరవై బండ్లు తలపడగా, విజేతలుగా నిలిచిన ఆయా యజమానులకు గ్రామ పెద్దలు గండి రవి కుమార్, గండి దేముడు, వీరాంజనేయస్వామి యూత్ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

పరిమితికి మించి లోడు..
ఇబ్బందులపై జనం గోడు

- 'సింహాద్రి' నుంచి నిత్యం లారీల్లో ఫ్లైయాష్ తరలింపు
- పైన టార్పాలిన్ కప్పకపోవడంతో రోడ్లపై జారిపడుతున్న బుగ్గి
- ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు



లంకెలపాలెంలో రహదారిపై పడిన ఫ్లైయాష్

లంకెలపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రధాన రహదారులపై ఫ్లైయాష్ పడుతుండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి నిత్యం లంకెపాలెం, పరసర ప్రాంతాల మీదగా లారీల్లో ఫ్లైయాష్ (తెల్ల బుగ్గి)ను రవాణా చేస్తుంటారు. పరిమితికి మించి లోడు వేస్తుండడంతో పాటు పైన టార్పలిన్ వంటివి కప్పకపోవడంతో ఆ బుగ్గి వాహనం వెళుతున్నప్పుడు రహదారి పొడవునా జారీ పడుతోంది. దీంతో ఈ రహదారిలో ఎక్కడ చూసినా ఫ్లైయాష్ కుప్పలే కనిపిస్తున్నాయి. ఫలితంగా ప్రధాన రహదారిని అనుకొని ఉన్న లంకెలపాలెం, పరిసర ప్రాంత గ్రామాలతో పాటు మంత్రిపాలెం, కన్నూరు, పెదముషిడివాడ, గండివానిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా ఈ బుగ్గి వాహనాలు వెళుతున్నప్పుడు గాలికి ఎగిరి ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడుతోంది. ఈ కారణంగా పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పరిమితికి మించి రవాణా చేస్తున్న ఫ్లైయాష్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

మార్టూరు క్వారీలో
బ్లాస్టింగ్‌తో ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు

- భయాందోళన చెందిన గ్రామస్థులు



అప్పారావు ఇంట్లో ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు

తుమ్మపాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరులో గల క్వారీలో మంగళవారం రాత్రి చేపట్టిన బ్లాస్టింగ్ వల్ల బొజ్జా అప్పారావు ఇంటి శ్లాబ్ పెచ్చులూడిపడ్డాయి. భారీ పేలుడు శబ్దానికి ఒక్కసారిగా శ్లాబ్ పెచ్చులు రాలి పడుతుండడంతో ఇంట్లో ఉన్న వారంతా భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ క్వారీల్లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్‌ల కారణంగా ఇళ్లన్నీ శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్‌ల శబ్దాల ధాటికి ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. తక్షణమే క్వారీల్లో జరుగుతున్న బ్లాస్టింగ్‌లపై అధికారులు దృష్టిసారించాల్సిందిగా అంతా కోరుతున్నారు. శ్లాబ్ పెచ్చులూడిన ఇంటికి నష్టపరిహారం చెల్లించాల్సిందిగా పలువురు డిమాండ్ చేస్తున్నారు.

యల్లయ్య కాలువపై కలవరపెడుతున్న కల్వర్టు

- పాడవ్వడంతో రాకపోకలకు ఇబ్బందులు
- జీవీఎంసీ వెంటనే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



మరిడిమాంబ ఆలయం వద్ద దెబ్బతిన్న కల్వర్టు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం మరిడిమాంబ ఆలయానికి వెళ్లే మార్గం యల్లయ్య కాలువపై నిర్మించిన కల్వర్టు దెబ్బతింది. ఇది గురుకుల పాఠశాలతో పాటు రైతులు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పొలాల్లోకి వెళ్లే మార్గం. అంతేకాకుండా నూకాంబిక అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు ఈ మార్గంలో ఉన్న తోటల్లోకి కుటుంబాల వచ్చి వంటలను చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తుంటారు. కొత్త అమావాస్య జాతర సమీపిస్తున్న నేపథ్యంలో మంగళ, గురు, ఆదివారాలలో ఈ మార్గంలో భక్తుల తాకిడితో పాటు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటుంది. పూర్తి స్థాయిలో కల్వర్టు దెబ్బతింటే ఈ మార్గంలో రైతులు, విద్యార్థులు, భక్తులకు ఇబ్బంది తలెత్తే అవకాశముంది. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా పలువురు కోరుతున్నారు.